


• చించోలి (బి) గ్రామంలోని శ్రీసాయి రైస్‌మిల్లులో చెడిపోయిన సీఎంఆర్ బియ్యం



• సీఎంఆర్ బియ్యాన్ని మిల్లింగ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)



రైస్ మిల్‌లో సీఎంఆర్ బియ్యం దృశ్యం (ఫైల్)

సీఎంఆర్ గడువు నేటితో పూర్తి!



- ఇంకా పూర్తికాని బియ్యం రికవరీ
- ధాన్యం టెండర్లు దక్కించుకున్న లిఫ్టింగ్‌కు ముందుకు రాని మిల్లర్లు
- చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్న అధికారులు
- అంతా రైస్‌మిల్లు యాజమాన్యాల ఇష్టారాజ్యం

నిర్మల్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): గత మూడు నాలుగేళ్ల నుంచి జిల్లా అంతటా రైస్‌మిల్లర్ల ఇష్టారాజ్యం సాగుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రైస్‌మిల్లర్ల సిండికేట్ ఆధిపత్యం కారణంగా సంబంధిత అధికారులు నిబంధనలు అతిక్రమిస్తున్నప్పటికి వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారు. ముఖ్యంగా సీఎంఆర్ బియ్యం చెల్లింపు విషయంలో గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి పలు రైస్‌మిల్లులు నిబంధనలను తుంగలో తొక్కి పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నా వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకాడుతుండడం అనుమానాలకు తావిస్తోంది. అయితే 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన దాదాపు 2లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. గతంలో సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే అప్పజెప్పాలంటూ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేయడమే కాకుండా చర్యలు తీసుకుంటామంటూ కూడా హెచ్చరించారు. అయితే జిల్లాలో సంబంధిత అధికార యంత్రాంగాన్ని శాసించే స్థాయిలో ఉన్న రైస్‌మిల్లర్ల సిండికేట్ ఈ హెచ్చరికలను బేఖాతరు చేసినట్లు ఆరోపణలున్నాయి. హెచ్చరికలు జారీచేసి అలిసిపోయిన అధికారులు పలుసార్లు బియ్యం చెల్లింపునకు గడువును సైతం విధించారు. అయితే గడువు తీరిపోయినప్పటికీ మిల్లర్ల ప్రవర్తనలో మాత్రం ఎలాంటి మార్పూ రాలేదు. చివరకు అధికారులు ఈనెల 30న 2023-2024 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యంను చెల్లించేందుకు గడువు విధించింది. ఈ గడువులోగా బియ్యం చెల్లించనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ సైతం తాఖీదు జారీచేసింది. ఇప్పటివరకు కూడా కొన్ని రైస్‌మిల్లులు మాత్రం కొంత మేర బియ్యం చెల్లించినప్పటికీ ఈ రెండు సీజన్‌లకు సంబంధించిన కేటాయింపులకు అనుగుణంగా మాత్రం పూర్తిస్థాయిలో బియ్యాన్ని అప్పజెప్పకపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. సోమవారం గడువు తీరిపోతుండగా ఇక మరుసటి రోజూ నుంచి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్న అంశం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

• 2023-2024 ఖరీఫ్ లెక్కలు

2023-2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1,42,757.680 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని అధికారులు రైతుల నుంచి సేకరించారు. ఈ సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా సీఎంఆర్ కోసం ఆయా రైస్‌మిల్లులకు కేటాయించారు. ఈ లెక్క ప్రకారం 95,664 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సర్కారుకు అప్పజెప్పాల్సిఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 49,115 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే రైస్ మిల్లర్లు సర్కారుకు అప్పజెప్పారు. ఇంకా 46,549 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అప్పప్పాల్సి ఉంది.

• రబీ సీజన్‌దీ ఇదే పరిస్థితి

2023-2024 రబీ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి 1,56,847 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అయితే రైస్‌మిల్లర్లు మిల్లింగ్ అనంతరం 1,05లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద సర్కారుకు అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 10,413 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి అప్పజెప్పారు. ఇంకా రైస్‌మిల్లర్లు 94,674 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉంది.

• నేటితో ముగిసిన గడువు

సీఎంఆర్ బియ్యం చెల్లింపు విషయంలో పలుసార్లు రైస్‌మిల్లర్ల కోసం సంబంధిత అధికారులు గడువును విధించినప్పటికీ మిల్లర్లు మాత్రం బియ్యాన్ని అప్పజెప్పడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. చివరకు ఈనెల 30న గడువును విధించారు. ఇప్పటికి కూడా మిల్లర్లు గడువును ఖాతరు చేయకుండా సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతోపాటు అధికారులు గడువు తీరిన కారణంగా బియ్యం అప్పజెప్పని రైస్‌మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్న అంశంపై కూడా అంతటా ఆసక్తి నెలకొంటోంది.

• టెండర్ దక్కించుకున్నా ముందుకు రాని మిల్లర్లు

2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన 1,41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు అధికారులు టెండర్ ప్రక్రియను నిర్వహించారు. అయితే టెండర్ పాడి ధాన్యాన్ని దక్కించుకున్న రైస్‌మిల్లర్లు మిగతా డబ్బు చెల్లించకపోతుండడమే కాకుండా ఆ ధాన్యాన్ని లిఫ్టింగ్ చేయకపోతుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యాన్ని టెండర్ ద్వారా దక్కించుకున్న మిల్లర్లు ఉద్దేశపూర్వకంగానే లిఫ్టింగ్ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. సంబంధిత శాఖలోని కొంతమంది అధికారులు మిల్లర్లకు పరోక్షంగా సహకారం అందిస్తున్న కారణంగానే ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లక్ష్మణచాంద, సెప్టెంబరు29: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2004-05 బ్యాచ్‌కు చెందిన లక్ష్మణచాందలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్‌లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులకు ఆత్మీయ స్వాగతం పలికి సత్కరించారు. పలువురు మాట్లాడుతూ పాఠశాలలో కలిసి చదివినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సామాజిక తనిఖీ

ముథోల్, సెప్టెంబరు29: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించడం కోసం 14వ విడత సామాజిక తనిఖీలు ఆదివారం నుండి ప్రారంభమైంది. 2023-24కు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన 358 పనులకు గాను సుమారు రూ. 3 కోట్ల 9 లక్షలకు సంబంధించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఆర్‌పీ భగవంత్ రావు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో 10 మంది డీఆర్‌పీలు, 20 మంది వీఆర్‌పీలు సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరిగిన పనులు, నిధుల దుర్వినియోగం వంటి విషయాలను గుర్తిస్తారు. ఈ నెల 7వ తేదీ లోపు గ్రామాల్లో తనిఖీలు చేపట్టి 8వ తేదీన మండల కేంద్రంలో ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

భైంసా, సెప్టెంబరు29: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాకు చెందిన ఐక్యత సేవా సమితి సభ్యులు ఆదివారం అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించారు. వారం రోజుల క్రితం బాసరలో గుర్తుతెలియని వృద్ధురాలు ఒకరు మృతిచెందారు. సంబంధిత మృతదేహాన్ని తీసుకవెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో భైంసాలోని ఏరియా ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో వృద్ధురాలి మృతదేహాన్ని భద్రపరిచారు. ఆసుపత్రి నిర్వాహకులు సంబంధిత మృతదేహం అంత్యక్రియల విషయంలో ఆదివారం ఐక్యత సేవా సమితి సభ్యులను సంప్రదించారు. దీంతో స్పందించిన ఐక్యత సేవాసమితి శ్రేణులు అనాథ శవానికి అన్నీతామే అయ్యి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేపట్టారు. స్థానిక సుద్దవాగు శ్మశనవాటికలో దహనసంస్కారాలతో అనాథశవానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కుభీర్, సెప్టెంబరు 29: మండలంలోని పల్సి గ్రామానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు పోశెట్టి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. దీంతో ఆదివారం గ్రామస్తులు ఆయనను శాలువతో సత్కరించారు. అదే విధంగా లెక్చరర్ గుజ్జాల్ సంతోష్, హెడ్‌మాస్టర్ సురేష్‌లను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు ఉన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కరాటేతో ఆత్మస్థైర్యం

• మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు29: కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ పెరుగుతాయని మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం సెన్సాయ్ చుక్క ధర్మరాజ్ స్మారక మెమోరియల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చుక్క ధర్మరాజ్ కరాటే సాధనలో ప్రగతి గాంచి శిష్యులను తయారు చేశారన్నారు. నిర్మల్‌లో మొదటిసారి కరాటే ప్రారంభించి శిక్షణ ఇచ్చారన్నారు. డాక్టర్ యూ.కృష్ణంరాజు, కరాటే విద్యార్థులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



పెద్ద భీమన్న మృతదేహం

దిలావర్‌పూర్, సెప్టెంబరు29: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన దిలావర్‌ఫూర్ మండలకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్సై భీమ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్‌ఫూర్ మండల కేంద్రానికి చెందిన మీసాల పెద్ద భీమన్న (53) గత తొమ్మిది సంవత్సరాలుగా డయాబెటిస్‌తో బాధ పడుతున్నాడు. వ్యాధి ప్రభావంతో రెండు పాదాలు పూర్తిగా చెడిపోయి వేళ్లు లేకుండా పోయాయి. ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా బ్లడ్ షుగర్ వల్ల ఇలా జరిగిం దని, పరిస్థితి చేయి దాటిందని చెప్పారు. తీవ్ర మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన భీమన్న ఆదివారం ఉదయం గ్రామానికి చెం దిన లింగోజీ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సాయవ్వ, కొడుకు రాజు ఉన్నారు. మృతుడి భార్య సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భీమ్‌రావు తెలిపారు.

వేదం తపోవన్ డైరెక్టర్‌కు ఫ్యూచరిస్టిక్ స్కూల్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న వేదం తపోవన్ పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ రెడ్డి

భైంసా, సెప్టెంబరు 29: మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని వేదం తపోవన్ హైస్కూల్ డైరెక్టర్ వరలక్ష్మీరెడ్డికి ఫ్యూచరిస్టిక్ స్కూల్ అవార్డు దక్కింది. బియాండ్ స్కూల్ దేశవ్యాప్తంగా పాఠశాలలను పరిశీలించి ప్రమాణాలను గుర్తించి ఫ్యూచరిస్టిక్ స్కూల్ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లా పరిధిలోని వేదం తపోవన్ హైస్కూల్‌ను సంబంధిత అవార్డు కోసం ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బియాండ్ స్కూల్ నిర్వాహకులు వేదం తపోవన్ డైరెక్టర్ వరలక్ష్మీ రెడ్డికి ఫ్యూచరిస్టిక్ స్కూల్ అవార్డును ప్రధానం చేశారు.

గీత కార్మికులకు మోకుల పంపిణీ

దిలావర్‌ఫూర్, సెప్టెంబరు 29: తాటి చెట్లు ఎక్కే సమయంలో ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు నూతన టెక్నాలజీతో రూపొందించిన మోకులను ఆదివారం బన్సపల్లిలో గీత కార్మికులకు ఆబ్కారీ శాఖ అధికారులు పంపిణీ చేశారు. దిలావర్‌ఫూర్ మండలం బన్సపల్లి, మాయపూర్, నిర్మల్ మండలం లక్ష్మీపూర్, లోకేశ్వరం మండలం నగర్, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన గీత కార్మికులకు నూతన టెక్నాలజీతో కూడిన మోకుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నిర్మల్, భైంసా ఆబ్కారీ శాఖ సీఐలు లక్ష్మణ్ రావు, నజీర్, ఎస్సైలు గజేందర్, అభిషేక్, గౌడ్ ఐక్య వేదిక అధ్యక్షుడు ప్రవీణ్, గీత కార్మికుల నాయకులు, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గంగాధర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, చిన్న రాజేశ్వర్ గౌడ్, గంగాధర్‌గౌడ్, రమేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, దేవగౌడ్, భూమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నూతన టెక్నాలజీ మోకు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



హోమం నిర్వహిస్తున్న పతాంజలి యోగా సమితి ప్రతినిధులు

భైంసాలో గాయత్రి శివ సంకల్ప హోమం

భైంసా, సెప్టెంబరు 29: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఆలయ ప్రాంగణంలో ఆదివారం పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మహిషానగర శాంతి, సుభిక్షం కోసం చేపట్టిన గాయత్రి శివ సంకల్ప హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాచార్య బ్రహ్మచారి అశోక్ ఆర్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావాలు పెంపొందించుకుంటూ ఆధ్యాత్మికతతో వ్యవహరిస్తూ తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. ఆపద సమయాల్లో కాకుండా అన్ని సమయాల్లోనూ ఆలయాల సందర్శన చేపట్టాలన్నారు. భక్తి భావాలతో మెలుగాలని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో వ్యవహరిస్తే అన్నింటా సత్ఫలితాలే ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా భావిస్తూ సమాజ సేవకు తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తూ ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నిత్యం యోగా సాధన చేపడితే వ్యాధులు దరిచేరవన్నారు. మతమార్పిడుల పట్ల అప్రమత్తతతో నడుచుకోవాలన్నారు. స్వీయరక్షణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. ఇందులో పతాంజలి మహిళా యోగా సమితి శ్రేణులు, శ్రీలక్ష్మీ నరసింహ యోగా శాఖ శ్రేణులు పాల్గొన్నాయి.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన ముథోల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన మహేందర్, సాయినాథ్

ముథోల్, సెప్టెంబరు29: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో 29న భైంసాలో జరిగిన రెజ్లింగ్ అండర్-14, అండర్-17 బాల బాలికల ఎంపిక పోటీల్లో ముథోల్ ఉన్నత పాఠశాలకు చెందిన అభిషేక్ (పదో తరగతి) జోనల్‌స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. అలాగే 27న సిర్గాపూర్‌లో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయికి 7వ తరగతి చదువుతున్న మహేందర్, సాయినాథ్ ఎంపికైనట్లు వివరించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఏకగీవ్రంగా మున్నూరుకాపు మిత్రమండలి కార్యవర్గ ఎన్నిక

భైంసా, సెప్టెంబరు29: భైంసా మున్నూరుకాపు మిత్రమండలి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడి గాలి రవి, ప్రధాన కార్యదర్శిగా పెదకాపు గజ్జారాం, కోశాధికారిగా వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పోశెట్టి, సంయుక్తకార్యదర్శిగా శంకర్‌లు ఎన్నికయ్యారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపులకు చర్యలు చేపట్టాలి

• మంత్రి సీతక్కకు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి విజ్ఞప్తి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఇతర నాయకులు

భైంసా/ నర్సాపూర్(జి), సెప్టెంబరు 29: గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు త్వరితగతిన చేపట్టాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంత్రి సీతక్కకు విన్నవించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులతో కలిమాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందచేశారు. బిల్లులు అందక పనులు చేపట్టిన మాజీ ప్రజాప్రతినిధులతోపాటు ఇతరులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని వివరించారు. ప్రభుత్వం, అధికారుల ఒత్తిడిలతో నిర్ణీత గడువులోగా పనులు చేపట్టేందుకు అప్పటి ప్రజా ప్రతినిధులు అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేశారని వివరించారు. వారంతా ఇప్పుడు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు సత్వరమే చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. ఇదేక్రమంలో నర్సాపూర్ (జి) మండలంలోని గొల్లమాడ గ్రామ పరిధిలో గల పురాతన సుప్రసిద్ధ హనుమాన్ ఆలయపునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి సీతక్క పెండింగ్ బిల్లుల కోసం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లుగా తెలిసింది. ఆలయానికి సంబంధించి నిధుల మంజూరు గురించి దేవాదాయశాఖ మంత్రికి వివరించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వివరించినట్లు సమాచారం. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాపెన్ రాజేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి, తిరుపతయ్య, నవీన్, లక్ష్మణ్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సలీం, తదితరులు ఉన్నారు.

గోల్డ్ మెడల్ అందుకున్న బాలుడికి సన్మానం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ద్వారా గోల్డ్ మెడల్ అందుకున్న స్థానిక పిట్టల్‌వాడకు చెందిన మాజీ సైనికుడు జల్‌పేట్ రాజు - జాహ్నవి దంపతుల నాలుగేళ్ల కుమారుడు సాయి లోహిత్‌ను స్మైల్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే బాలుడు ఇలాంటి ఘనత సాధించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో స్మైల్ సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, రామకృష్ణ, దత్తు పాల్గొన్నారు.



బాలుడిని సన్మానిస్తున్న స్మైల్ సొసైటీ సభ్యులు

అంగన్‌వాడీల దుస్థితి మారేదెన్నడో!?

● అసంపూర్తి భవనాలు.. అరకొర వసతులు ● అంగన్‌వాడీ భవనాల దశ మార్చేందుకు చర్యలు కరువు ● ఎందరు ప్రజాప్రతినిదులు మారినా వాటి పరిస్థితి అంతేనా?

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 29: నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు. వారికి ఉన్నత చదువులు అందించడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ప్రభుత్వం ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు విద్యా బుద్దులు నేర్పే అంగన్‌వాడీలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. అభం శుభం తెలియని చిన్నారులకు అన్ని విదాల పౌష్టికాహారం, విధ్యను అందించడానికి కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నచూపు చూడడంతో అనేక గ్రామాల్లో మరుగున పడిన, ఇండ్లలో, అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు కొనసాడుతున్నాయి. ఐదేళ్ళకోసారి ఎందరో ప్రజాప్రతినిధులు మారినా అంగన్‌వాడీల పరిస్థితి మాత్రం మారడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రలంలోనే రెండు అంగన్‌వాడీ భవణాలు అద్దె ఇళ్ళలో కొనసాగడం చూస్తూనే ఏ స్థాయిలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు అంగన్‌వాడీలపై దృష్టి సారిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు!!


● ధరంపురి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు

మండలంలోని మూడు సెక్టారులలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండగా.. అందులో 21 అంగన్‌వాడీ కేద్రాలకు మాత్రమే పక్క భవనాలు ఉన్నాయి. అంతేకాకుండా మిగతా 22 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో, ప్రభుత్వ ఆదీనాల్లో ఉన్నా పాఠశాలలో 15 భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు చేసి నిర్మాణాలనుపూర్తిచేయడం లేదని భవనాల నిర్మాణాలు పూర్తి కాకుండా ఉండిపోయాయని మండలవాసులు వాపోతున్నారు.. వాటికి అదనంగా మరికొన్ని నిధులు మంజూరు చేసినప్పటికీ.. ఇంత వరకు సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోక.. మరోవైపు నిర్మాణాలు పూర్తికాక చిన్నారులకు శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాల్సి వస్తుందని పలువురు అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెలకు సరిపోని డబ్బులు..

భవనాలు సరిగా లేకపోవడంతో గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రూ.500లు, మండలకేంద్రాల్లో 800లు, ప్రాజెక్టు కార్యాలయం నుంచి అద్దె చెల్లింపునకు అనుమతులు ఉండడంతో అద్దె తక్కువగ ఉన్నందున రూములు దొరకక ఒకవేళ దొరికినా అద్దె ఎక్కువ కావడంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు భరించుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మరి కొన్ని చోట్ల అద్దె భవనాల్లో పప్పులు, బియ్యం, గుడ్లు వంటి వస్తుసామగ్రి ఉండడంతో వాటి కోసం ఎలుకలు, పందికొక్కులు, పాములు వస్తుండడంతో పిల్లకేమైనా జరిగితే మా పరిస్థితి ఏంటని కొందరు అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని అన్ని అంగన్‌వాడీ కేంద్నాలకు భవనాలను త్వరగా పూర్తి చేయించి అంగన్‌వాడీ కేంద్రాలు అందులో కొనసాగే విదంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.


క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమేష్, ఎస్సై ఇమ్రాన్

నేడు పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

ఇచ్చోడ, సెప్టెంబరు, 29: యువత అన్ని రంగాలలో అభివృద్ది చెందాలనే సదుద్దేశంతో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ మండలంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం మోగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్ తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారి గౌస్ ఆలం అధ్యక్షతన ఈ పోటీలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ. 10,116 నగదు బహుమతి, రెండవ బహుమతి రూ. 8,116, మూడవ బహుమతి రూ. 5,116 నగదు బహుమతి అందజేయనున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. యువత అత్యధిక సంఖ్యలో పాల్గొని క్రీడాలను విజయవంతం చేయాలని పోలీసులు కోరారు.

బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలుగా జాదవ్ సుమన్‌బాయి



ఉట్నూర్, సెప్టెంబరు 29: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ సుమన్‌బాయి బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళ మోర్చ అధ్యక్షురాలు శిల్పారెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సుమన్ బాయిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గిరిజన వర్గానికి చెందిన రిటైర్డ్ పీజీహెచ్‌ఎం జాదవ్‌సుమన్‌బాయినినియమించడం పట్ల ఉట్నూర్ మండల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సుమన్‌బాయి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నట్లుగానే రాజకీయాల్లో కూడా రావాలని అన్నారు. మహిళలకు సముచిత స్థానం ఇస్తున్నందున మహిళలు బీజేపీ పట్ల ఆకర్షితులు అవుతున్నారని, మరింత మంది పార్టీలో చేరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.


జిల్లా అధ్యక్షురాలిని సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

● మహిళా సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షురాలు

తలమడుగు, సెప్టెంబరు 29: మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహిళా సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షురాలు కుమ్ర పద్మ అన్నారు. ఆదివారం మండలంలోని పాల్సీ(బి) గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 25న జరిగిన మహిళా సంఘర్షణ సమితి జిల్లా స్థాయి సమావేశంలో మహిళా సంఘర్షణ కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా కుమ్ర పద్మని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా కుమ్ర పద్మ తలమడుగు మండలంలోని పాల్సి(కె) గ్రామంలో గల నారాయణ బాబా ఆశ్రమంలో దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లాల నుంచి వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పద్మను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్సీ(కె) తండా, రుయ్యాడి, ఆనందపూర్, సంఘవి, సోనాల, దీపాయిగూడ, దహేగావ్, కుచలాపూర్, లింగి ఆదిలాబాద్ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

రోడ్డును తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి : గ్రామస్థులు


చింతలబోరి రోడ్డుపై అడ్డంగా తవ్విన గుంత

బోథ్, సెప్టెంబరు 20: మండలంలోని చింతల బోరి గ్రామానికి వెళ్లే రోడ్డుపైన సోనాల గ్రామం సమీపంలో కొంత మంది వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా గుంతలు తవ్వారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తమతమ అవసరాల కోసం రోడ్డుకు అడ్డంగా తవ్వకాలు చేపట్టడం వల్ల ఈ రూట్‌లో వెళ్లే వాహనాల వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు తక్షణ మే రోడ్డును పరిశీలించి రోడ్డు గుంత పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మావల, సెప్టెంబరు 29: బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన 2004-2005 ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరూ ఏ స్థాయిలో ఉన్నారు. ప్రతి ఒక్కరు తమ తోటి స్నేహితుల కష్ట సుకాల్లో పాలుపంచుకుని చేదోడు వాదోడుగా తమవంతు సహాయ సహకారాలను అందిచాలని ప్రతిజ్ఞ చేశారు. ఇందులో భాగంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమ తోటి మిత్రులకు ఆపద సమయంలో ఆదుకునేందుకు జమ చేసి ఆపద వచ్చినప్పుడు ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. భవిష్యత్తులో ఏది ఏమైనా తమ పదవ తరగతి విద్యార్థులు అందరూ ఒకరినొకరు తమ కష్ట సుఖాలను తోటి మిత్రులతో పంచుకోవాలని తోచిన సహాయాన్ని అందించి కష్టాల్లో ఉన్న తమ స్నేహితునికి అండగా నిలవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో సామ రూపేష్, నగేష్‌రెడ్డి, జైపాల్, నవీన్‌తరెడ్డి, అరుణ్, అమరేందర్‌రెడ్డి, దీపక్, అనిల్, గణేష్, కవిత, శరణ్య, శాలినిరెడ్డి, లలిత, మనీషా, అర్చన తదితరులు ఉన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న 2004-2005 బ్యాచ్‌కు చెందిన సాంగిడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం


మాన్కాపూర్‌కు కాలినడకన వెళ్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


కార్యక్రమంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే

● గ్రామాల్లో రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 29: బోథ్ నియోజకవర్గంలోన్ని మారుమూల అన్ని గ్రామాలకు బిటి రోడ్డు నిర్మాణం కల్పిస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని డేద్రా మరియు మాన్కాపూర్ గ్రామాల పరిస్థితి రోడ్డు సౌకర్యాలను పరిశీలించేందుకు ఆయన వచ్చారు. ముందుగా గ్రామస్థులు భాజా భజంత్రీలతో ఆయనకు గనంగా స్వాగత ం పలికారు. డేద్రా ఉమర్దా గ్రామంలోని బాల వికాస్ సంస్థ అందజేసిన సోలార్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రాంభించారు. మాన్కాపూర్ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే వాహణం ఆ గ్రామానికి వెళ్ళే పరిస్థితి లేకపోవడంతో కొంతదూరం కాలినడకన తరువాత గ్రామస్థులు ద్విచక్రం వాహణంపై మాన్కాపూర్ గ్రామానికి చేరుకున్నారు. వారి గ్రామానిక ఉన్న రవాణా మార్గం పరిస్థితి చూసి చలించి పోయారు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం 108 వాహనం కూడా గ్రామానికి రాని పరిస్థితి మాదని గ్రామస్థులు ఆయనకు తెలిపారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత బిఆరెస్ ప్రభుత్వం హయాంలో బూతాయి నుంచి డేద్రా గ్రామం వరకు రూ.కోటీ 75లక్షలు, డేద్రా నుంచి మాన్కాపూర్ వరకు రూ.కోటీ 55లక్షలు, బూతాయి(కె) నుంచి ఉమర్దా వరకు రూ.3కోట్ల 77లక్షలు, గిరిజాం వరకు రూ.కోటీ 10లక్షల లను మంజూరు చేసిందని అన్నారు. ఈ దసరా తరువాత కచ్చితంగా ఈ పనులన్నింటిని ప్రాంభించి పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వినర్ కానిందే రాజారాం, నాయకులు కవీందర్, అనిల్, చందు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని మన్‌కీ బాత్' నాయకుల వీక్షణ

బోథ్, సెప్టెంబరు 20: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్త హరీష్ ఇంటిలో వీక్షించారు. అనంతరం బీజేపీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా సభ్యత్వ నమోదు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులుతో పాటు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీ.వీ.రమణ, సీనియర్ నాయకులు సుభాష్, సూర్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి తుకారం, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానాల శేఖర్, రంజిత్‌సింగ్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ తూము సూర్యం, బీజేవైఎం మండల అధ్యక్షులు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

'ముఖాముఖీ'కి హాజరైన తహసీల్దార్

తలమడుగు, సెప్టెంబరు 29: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తహసీల్దార్లతో ముఖాముఖీ కార్యక్రమానికి తలమడుగు తహసీల్దార్ రాజ్‌మోహన్ హాజరయ్యారు. సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ సీసీఎల్‌ఏ హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్లు, రెవెన్యూ శాఖ కమిషనర్ తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

తలమడుగు, సెప్టెంబరు 29: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం మండలం పల్లి (బి) గ్రామంలో ఆదివాసీ మెస్రం మారుతి భార్య రేణుక బ్రెయిన్ ట్యూమర్‌తో గాంధీ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ చేయించుకుని మృతి చెందగా.. ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన కొడప లక్ష్మీ మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, బరంపూర్ గ్రామానికి చెందిన దాసరి ఆశన్న తండ్రి భూమన్న మరణించంతో వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు.


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న గిరిజన క్రీడల అధికారి

ఉత్సాహంగా చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 29: మనిషి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమించేందుకు చెస్ క్రీడ ఎంతో దోహదం చేస్తుందని గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 జిల్లాస్థాయి చెస్ బాలబాలికల ఎంపిక పోటీలను ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపికైన వారిని అక్టోబర్ 29న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీలో పాల్గొంటారని పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వామి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 29: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించి కేక్ కట్ చేశారు. అంతకుముందు పలువురు సభ్యులు ఆర్గనైజేషన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే వ్యవసాయ పథకాలు బంద్

● ఇచ్చోడ వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్‌నాయక్

ఇచ్చోడ, సెప్టెంబరు, 29: పంటపొలాల్లో గంజాయి సాగు చేస్తే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసాయ పథకాలు వర్తించవని ఇచ్చోడ వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని గుబ్బా గ్రామంలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం గుబ్బా గ్రామశివారులోని పంటపొలంలో అంతరపంటగా గంజాయి పంటను సాగుచేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. గంజాయి సాగుచేసే రైతులకు ప్రభుత్వం తరపున వచ్చే రాయితీలు, పంటబీమాలు, రుణ మాఫీలు, రైతుబంధు తదితర పథకాలకు దూరమవుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ భీంరావ్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.


గుబ్బా గ్రామ రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ


పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన కృష్ణకుమార్, నరసింహ స్వామి

ప్రశాంతంగా ముగిసిన పీఆర్టీయూ ఎన్నికలు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 29: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ సంఘం భవనంలో జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా కృష్ణకుమార్, నరసింహ స్వామి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నరేందర్ బాబు, రమణబాబు వ్యవహరించారు. కృష్ణ కుమార్ 57 ఓట్లు రాగా ప్రత్యర్థి కుడాల రవీందర్‌కు 42 ఓట్లు వచ్చాయి. దీంతో 17 ఓట్లతో కృష్ణకుమార్ జిల్లా అధ్యక్షునిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శికి టి.స్వామికి 59 ఓట్లు రాగా ప్రత్యర్థి సూర్యకాంత్‌కు 40 ఓట్లు వచ్చాయి. దీంతో 19 ఓట్లతో ప్రధాన కార్యదర్శిగా టి.స్వామి గెలుపొందారు. ఎన్నికల్లో మొత్తం 99 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు.

సాయి లింగిలో దేశీదారు పట్టివేత

తలమడుగు, సెప్టెంబరు 29: తలమడుగు మండలంలోని సాయి లింగి గ్రామానికి చెందిన ఎగ్గూ చిన్నాన్న అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి దేశీదారు 49 బాటిల్స్ మోటార్ సైకిల్‌పై తీసుక రాగా లక్ష్మీపూర్ చెక్ పోస్టు వద్ద ఎస్సై అంజమ్మ వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తలమడుగు పోలీసులు తెలిపారు. పట్టుకున్న దేశీదారు బాటిళ్ళ విలువ దాదాపు రూ.1700 వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా దేశీదారు, కల్తీ కళ్ళు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాంసికి బస్సు నడపండి : యువజన నాయకులు

తాంసి, సెప్టెంబరు 29: మండల కేంద్రమైన తాంసికి పూర్తిస్థాయిలో బస్సు నడవకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు నడపాలంటూ ఆదివారం ఆర్టీసీ అధికారుల కు యువజన సంఘాల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బస్సు రాని కారణంగా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, మండలకేంద్రానికి బస్సులు నడవకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. వెంటనే బస్సు నడపాలని, లేనిపక్షంలో తీవ్ర ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. ఇందులో రవీందర్, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన కేంద్ర నర్సరీని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్


ఉట్నూర్‌లో ఉద్యానవన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఉట్నూర్, సెప్టెంబరు 29: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల కేంద్రంలోని పండ్ల తోటల ఉద్యాన వన నర్సరీ, అలాగే శిక్షణ కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ సందర్శించారు. నర్సరీలో చేపడుతున్న వివిధం కార్యక్రమాలను ఐటీడీఏ పీహెచ్‌వో గుడిమల్ల సందీప్ కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. రైతుల కోసం చేస్తున్న శిక్షణ కార్యక్రమాల గురించి సందీప్‌కుమార్ ఆయన గౌరవించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న పసుపు, టమాట వరి జామ తోటలను పరిశీలించారు. వాన నీటి సంరక్షణ ఏర్పాటు చేసిన కందకాలు, ఫారంపండ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ రకాల మొక్కలను మామిడి అంటూ మొక్కలను, మునగ మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌వో సుధీర్‌కుమార్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేజం మనోహర్, టెక్నికల్ అసిస్టెంట్ బి.హర్షిత ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాంసి, సెప్టెంబరు 29: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పరిసరాల పరిశుభ్రతను పాటించేలా స్థానిక అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సీపీవో సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని తాంసి, పొలోడి, జామిడి గ్రామాలలో పారిశుధ్యం పనులను ఆయన పర్యవేక్షించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈయనతో పాటు ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, కార్యదర్శి గంగన్న, తదితరులు ఉన్నారు.

8 కిలోమీటర్లు.. ఎన్నో గుంతలు!


అధ్వానంగా గుంతలతో నిండిన ఆసిఫాబాద్ రోడ్డు

- జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అధ్వానంగా పలు రహదారులు
- నరకానికి నకలుగా మారిన ఆసిఫాబాద్ రోడ్డు
- గుంతలమయమైన రోడ్లపై ప్రయాణం చేస్తూ.. అనారోగ్యం పాలవుతున్న వాహనదారులు
- గడిచిన మూడేళ్లలో 10మందికి పైగా వాహనదారుల మృత్యువాత
- అనేక సార్లు టెండర్లు పిలిచినా.. ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఉట్నూర్, సెప్టెంబరు 29: సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి నిధుల కొరత లేదని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతుండడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదంటున్నారు. జిల్లాలోని ఏజెన్సీలో గల పలు రహదారులు గుంతలమయంగా మారడంతో నరకప్రాయంగా ప్రయాణాలు సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో వల్ల ప్రతీరోజు గుంతల రోడ్లపై ప్రయాణం సాగిస్తూ.. అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావిస్తుంటే.. ప్రభుత్వంపై నమ్మకం లేక కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదంటున్నారు.

వాహనదారుల ఇక్కట్లు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు నుంచి లింగోజి తండా ఎక్స్ రోడ్డు వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల మేర గల రోడ్లు భవనాల శాఖ రహదారిపై ఎన్నో గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి ఆదిలాబద్ జిల్లాను నాలుగు జిల్లాలుగా విభజించారు. అయితే, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ మండలం లింగోజి తండా తుకారం ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వెళ్లే ప్రధాన రహదారి 8 కి.మీ.ల హనుమాన్ టెక్కి వరకు రోడ్డు అంతా గుంతలమయం అయ్యింది. ప్రతినిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో పాటు ఈ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు రోడ్డు ఉండడంతో సిమెంట్ లారీలు, భారీ వాహనాలు సైతం ఈ రోడ్డు గుండా నడుస్తున్నాయి. ఒక వర్షాకాలం కంటే ముందు నుంచి జైనూర్ నుంచి ఉట్నూర్ లింగోజి తండా ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయి భారీగా గుంతలు ఏర్పడ్డాయి. జైనూర్ నుంచి కెరమెరి, ఆసిఫాబాద్ నుంచి కెరమెరి వరకు సైతం రోడ్డు అంతా గుంతలమయంగా కనిపిస్తోంది. ప్రతినిత్యం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రోడుకు ఇరువైపులా ఎత్తునదలు ఉండడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

10 మందికిపైగా మృతి

ఉట్నూర్ మండలంలోని తుకారం ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో గత మూడేళ్ల కాలంలో పది మందికి పైగా వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రోడ్డుకు ఇరువైపులా బీటీ పక్కన ఉన్న గుంతలలో మొరంమట్టి పోయించడంలో సంబంధిత శాఖల అధికారులు విఫలం అయ్యారు. ఫలితంగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రజలు గుంతలలో పడి మృత్యువాత పడుతున్నారు.


హస్నాపూర్ రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంత

టెండర్లు పిలిచినా..

ఉట్నూర్ మండలంలోని తుకారం ఎక్స్ రోడ్డు నుంచి హనుమాన్ టెక్కి వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. అంతేకాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేపట్టడానికి ఇప్పటి వరకు ఏడు సార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రోడ్డు భవనాల శాఖ పని చేస్తున్నా.. కాంట్రాక్టర్లకు గత పనులకు సంబంధించిన నిధులు రాక ఇబ్బందులు పడాల్సి వస్తోందని భావిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించి.. మంజూరు చేసిన మిగితా రోడ్డుకు సంబంధించిన పనులు పూర్తి అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏజెన్సీల్లోని రోడ్ల మరమ్మతుల కోసం ఉద్యమిస్తాం

: పుర్క బాపురావు, జిల్లా అధ్యక్షుడు, తుడుందెబ్బ



ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో రోడ్లు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు కావడం లేదు. గుంతలమయంగా ఉన్న రోడ్లపై ప్రయాణం చేస్తూ.. ఎందరో మంది గిరిజనులు మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే రోడ్ల మరమ్మతుల కోసం ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందేమో!!

రూ.2.50 కోట్ల నిధుల మంజూరు

: అరవింద్, ఏఈఈ ఆర్‌అండ్‌బీ, ఉట్నూర్



ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా ఎక్స్ రోడ్డు నుంచి హనుమాన్ టెక్కి వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయి. రూ.రెండు కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు కావడంతో ఇప్పటి వరకు టెండర్లు పిలిచినప్పటికీ.. కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకురావడం లేదు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

- సమగ్ర కుల గణన చేపట్టాలి
- బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు
- బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్
- జిల్లాక్రేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద బీసీల సత్యాగ్రహ దీక్ష
- పెద్దసంఖ్యలో హాజరైన నాయకులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 29: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు పోరాడుతామని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ ఆదివారం అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లోని ఆర్‌అండ్‌బీ ముందు బీసీ జన సభ, దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుల జన గణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చట్లేదని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తన కులపోళ్లకే పదవులు ఇస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి బీసీల ఓట్లు కావాలి పదవులు మాత్రం వద్దా? అని ప్రశ్నించారు. బీసీల ఓట్లు కొల్లగొట్టడం కోసమే సీఎం చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికిరణ్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ, అవ్వారు వేణుకుమార్, గంజెంద్, కాశవేణి నారాయణ, హన్మాండ్లు యాదవ్, ఈర్ల సత్యనారాయణ, పార్థ సారథి, అన్నదానం జగదీష్, రఘువీర్ యాదవ్, రవికాంత్, వేణుయాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్

రైతు ఉత్పాదక జిన్నింగ్‌లో రూ.1.62 కోట్ల వ్యాపారం

- ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.15 లక్షల నజరానా
- రైతు ఉత్పాదక సంఘం చైర్మన్ మెస్రం జంగుబాయి, ప్రధాన కార్యదర్శి పెందూర్ భగవంత్‌రావు
- 8వ వార్షికోత్సవ సంఘ సమావేశానికి హాజరైన రైతులు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 29: ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి జిన్నింగ్ మిల్లులో రూ.1.62 కోట్లా వ్యాపారం చేశామని రైతు ఉత్పాదక సంఘం చైర్మన్ మెస్రం జంగు బాబు, ప్రధాన కార్యదర్శి పెందూర్ భగవంత్‌రావులు రైతులకు తెలిపారు. ఆదివారం రైతు ఉత్పాదక సంఘం 8వ వార్షికోత్సవ సమావేశాన్ని జిన్నింగ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంఘంలో సభ్యులుగా చేరిన రైతులను ఉద్దేశించి గత ఏడాది జరిగిన వ్యాపార లావాదేవీలు, సిబ్బంది వేతనాలు బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించిన వడ్డీపై పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని ఏ రాష్ట్రంలో రైతులు సంఘటితంగా లేరని, నాబార్డు గుర్తించడంతో పాటు రైతు ఉత్పాదక సంఘానికి బుల్లోరా వాహనం సమకూర్చడంతో పాటు రూ.6.50 లక్షల రూపాయల రాయితీ ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక సంఘం వివరాలను తెలుసుకోవడంతో పాటు ప్రథమంగా ముఖ్యమంత్రిగా కేస్లాపూర్ గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంగా సంఘానికి రూ.15 లక్షలు రాయితీ మంజూరు చేసి రైతులకు నజరానా ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం మంజూరు చేసిన రూ. 15 లక్షలతో జిన్నింగ్‌లో షెడ్ నిర్మాణం పనులు చేపట్టేందుకు గానూ తీర్మానించారు. అదేవిధంగా 44.55 లక్షల విలువ చేసే ఎరువులు, విత్తనాలను రైతు ఉత్పాదక సంఘం ద్వారా విక్రయించడం జరిగిందని, ఈ సంఘం ద్వారా రూ.57.50 లక్షల విలువ చేసే కందులను కొనుగోలు చేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండింటి ద్వారా సంఘానికి రూ.1.25 లక్షల నికర లాభం వచ్చిందని వివరించారు. రైతుల నుంచి అప్పులు రావాల్సి ఉన్నాయని, ఈ ఏడాది ఖరీఫ్ పంటలు విక్రయించిన తరువాత చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాథోడ్ నిలేష్, సీఈవో కమలాకర్‌లతో పాటు సంఘంలో 837 మంది రైతులు పాల్గొన్నారు.



గత ఏడాది జరిగిన వ్యాపార వివరాలను రైతులకు వివరిస్తున్న రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పెందూర్ భగవంత్‌రావు